క్లుప్తంగా

దత్తాత్రేయుడికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఎన్‌హెచ్‌-167 కే పనులు త్వరలో ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరం నుంచి నంద్యాల వరకు నిర్మించబోయే జాతీయరహదారి 167 కే పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు ఏఈ రవికాంత్ గురువారం తెలిపారు. ఎన్‌హెచ్‌-167కే నిర్మాణ పనులు మార్చిలో ప్రారంభం కానున్నాయన్నారు. సంగమేశ్వరం నుంచి నంద్యాల జిల్లా కేంద్రం వరకు 620.279 ఎకరాల భూమిని సేకరించామన్నారు. భూ సేకరణ రైతులకు నష్టపరిహారం దశలవారీగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఎన్‌హెచ్‌ఓ కన్వర్షన్‌కు రూ.776.17 కోట్లతో 62.571కి.మీ మేర జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ రహదారిని పది మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు.

ప్రతిభా పోటీ పరీక్షల్లో విజేతలు వీరే

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో వెలుగోడు స్టూడెంట్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రతిభ పోటీ పరీక్షలు నిర్వహించారు. రిటైర్డ్ అధ్యాపకులు యాదాటి రవీంద్రుడు మాట్లాడుతూ పోటీ పరీక్షలు పదో తరగతిలో మంచి మార్కులు సాధించడానికి ఉపయోగపడతాయన్నారు. మండల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీ పరీక్షల్లో ఇంగ్లిష్ మీడియంలో మధు నారాయణ, దేవి శరణ్య, భరత్, తెలుగు మీడియంలో ఎస్ వి ప్రసన్న, సుదర్శన్, దినేష్, ఉర్దూ మీడియంలో షేక్ చాందిని, అలియా, హర్షియాలు మెరిట్ సాధించారన్నారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు.

నూతన డివిజన్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆత్మకూరు: మహిళా ఉద్యోగుల సంఘం డివిజన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. నంద్యాలోని శాంతిభవనంలో సంఘం రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరీ విజయలక్ష్మి, జిల్లా చైర్‌పర్సన్ నాగమణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆత్మకూరు డివిజన్ చైర్‌పర్సన్‌గా కె.అరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ విమలమ్మతోపాటు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీడీఎస్‌యూ విలీన సభను జయప్రదం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


ఆత్మకూరు: ఈనెల 14న నెల్లూరులో జరిగే పీడీఎస్‌యూ విలీన సభకు విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు హాజరై జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె.జునైద్‌బాషా కోరారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) చరిత్రలో ఇదొక చారిత్రాత్మకమైన సందర్భమన్నారు. ఈ ఐక్యత దేశంలో ఉన్న మరిన్ని విప్లవ విద్యార్థి సంఘాల ఐక్యతకు తోడ్పాటునందిస్తుందన్నారు. దీని ద్వారా దేశంలో బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ నాయకులు రంజిత్, శ్రీనివాసులు, రఫీ, యాకూబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాలకు చెక్

కొత్తపల్లి: డ్రోన్ కెమెరా నిఘాతో గ్రామాల పొలిమేరలలో జరిగే అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టనున్నట్లు ఎస్‌ఐ ఎం.కేశవ తెలిపారు. గురువారం కొత్తపల్లి, గ్రామ శివారులో డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాలలో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, చట్టవ్యతిరేక, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకు డ్రోన్ కెమెరాలను పోలీసులు వినియోగిస్తున్నారన్నారు. గువ్వలకుంట్ల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో నిఘాపెట్టామన్నారు.

రండి బాబూ రండి .. మా వద్ద మద్యం తీసుకెళ్లండి

- బెల్ట్ దుకాణాల నిర్వాహకులకు గాలం వేస్తున్న మద్యం దుకాణ దారులు
- కొందరు బెల్ట్ దుకాణం దారుల ఇళ్లకే మద్యం సరఫరా చేస్తున్న వైనం





జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు కావటంతో వారు తమ వద్ద మద్యం తీసుకెళ్లండంటే తమ వద్ద మద్యం తీసుకెళ్లండటంటూ గ్రామాల్లోని బెల్ట్ దుకాణాల దారులకు గాలం వేస్తున్నారు. రెండు మద్యం దుకాణాల మధ్య పోటీ నెలకొనటంతో మద్యం విక్రయాలను పెంచుకునేందుకు దుకాణాలదారులు గ్రామాల్లోని బెల్ట్‌దుకాణాల నిర్వాహకులను తమవైపు తిప్పుకునేందుకు ఎవ్వరికి వారు మద్యం దుకాణాల దారులు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో మినరల్ వాటర్‌ప్లాంట్ల కంటే మద్యం దుకాణాలు అధికంగా ఉన్నాయి (ఒక్కో గ్రామంలో 6 బెల్ట్ దుకాణాలున్నాయి). గ్రామాల్లోని కిరాణం, నివాసగృహాలు, కూల్‌డ్రింక్ షాపులతోపాటు ప్రత్యేక బెల్ట్ దుకాణాలు నిర్వహించి యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. దీనికితోడు జూపాడుబంగ్లాలో మద్యం దుకాణాలున్నా దుకాణాలు తెరిచే సరికి ఉదయం 10 గంటలు అవుతుండటంతో ఈలోగా ఆరుగురు బెల్ట్‌దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నారంటే ఏ మేరకు బెల్ట్‌దుకాణాలు కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు ఓ మద్యం దుకాణం దారుడు ఏకంగా గ్రామాల్లోని బెల్ట్‌దుకాణం దారులకు డోర్ డెలివరీ చేస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించినా ఆచరించే నాథుడే లేరు. ఏఏ గ్రామాల్లో ఎన్ని బెల్ట్ దుకాణాలున్నాయి, వారు ఎక్కడెక్కడి నుంచి మద్యం కొనుగోలు చేస్తున్నారనే విషయాలు ఎక్సైజ్ శాఖ, సివిల్‌పోలీసులకు స్పష్టంగా తెలుసు. అయినా వారెవ్వరూ ఇప్పటిదాకా సోదాలు నిర్వహించి మద్యం అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. దీన్ని బట్టి చూస్తే ముఖ్యమంత్రి ఆదేశాలను అధికారులు ఏమాత్రం ఖాతరు చేయటం లేదని అర్థమవుతోంది.

విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలి

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజన గురుకులాల్లో విద్యార్థుల మెనూ చార్జీలను పెంచాలని కొమురంభీం చెంచుగిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వై.ఆశీర్వాదం గురువారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వెంకటశివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని మెనూ చార్జీలు పెంచాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతపారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ముందుగా రథశాల నుంచి పెద్దసత్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలు ప్రధాన రహదారులు, ఆలయ మాడవీధులు, గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు, అన్నప్రసాద వితరణ పరిసరాలు, సీఆర్‌ఓ కార్యాలయ పరిసరాలు, దర్శన కాంప్లెక్స్, గంగా, గౌరీ సదనాలు, టూరిస్ట్ బస్టాండ్, మల్లమ్మ కన్నీరు, పంచమఠాల పరసరాలు, పీహెచ్‌సీ మొదలైన చోట్ల ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

నీటి ముంపు నిర్వాసితుల ధ్రువపత్రాల పరిశీలన


ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పగిడ్యాల: శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ నిర్మాణంలో సర్వం కోల్పోయిన నీటి ముంపు నిర్వాసితులైన అవార్డుదారుల ధ్రువపత్రాలను హెచ్‌ఎన్‌ఎస్ఎస్ యూనిట్ 4 అధికారులు పరిశీలించారు. గురువారం మండలంలోని బీరవోలు గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి అవార్డుదారుల వివరాలను తెలుసుకున్నారు. నష్టపరిహారం కోసం గతంలో లోక్ అదాలత్ కోర్టును ఆశ్రయించిన అవార్డుదారులకు పరిహారం చెక్కులు అందించేందుకు ఈ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ మధు తెలిపారు. బీరవోలులో సుమారు 491 మందికి పరిహారం చెక్కులు పంపిణీ చేసేందుకు అవార్డుదారుల నుంచి వారు జీవించి ఉంటే ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. అవార్డుదారులు మరణిస్తే వారి రక్తసంబంధీకుల నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, మరణ ధ్రువపత్రం, సెల్ఫ్ అఫిడవిట్, ఆధార్, బ్యాంక్ పుస్తకం జిరాక్స్ కాపీలను ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్ఎస్ యూనిట్ 4 డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వో భగవాన్‌దాస్, వీఆర్‌ఏలు ఉన్నారు.

నిందితుడికి రిమాండ్

పగిడ్యాల: అక్రమ మద్యం విక్రయిస్తూ పట్టుబడిన నిందితుడు పలుచాని మహేశ్వరరెడ్డికి నందికొట్కూరు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ముచ్చుమర్రి స్టేషన్ పరిధిలోని తూర్పు ప్రాతకోటకు చెందిన పలుచాని మహేశ్వరరెడ్డి కొన్ని నెలల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంటిలోని కిరాణం దుకాణం ద్వారా మద్యం విక్రయిస్తూ బుధవారం పట్టుబడ్డాడన్నారు. నిందితుడి నుంచి 9 బీర్ బాటిళ్లు, 7 ఓల్డ్ అడ్మీరియల్ బాటిళ్లు, 2 ఇంపీరియల్ బ్లూ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి గురువారం అరెస్ట్ చేశామన్నారు. నిందితున్ని నందికొట్కూరు కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించారని ఎస్‌ఐ వెల్లడించారు.

నెలాఖరులోగా పశుగణన పూర్తి చేయాలి


పాత ముచ్చుమర్రి పశువైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసరావు

పగిడ్యాల: ఈనెలాఖరులోగా పశు గణన సర్వేను పూర్తి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మండలంలోని పడమర ప్రాతకోట, పగిడ్యాల, పాత ముచ్చుమర్రి పశుగణాభివృద్ధి కేంద్రాలను ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి తూర్పు గోదావరి జిల్లాలో వెలుగు చూసినందున మండలంలో ఏమైనా కోళ్ల ఫారాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. గొర్రెలకు మసూచి టీకాలు వేయడం ఎంత శాతం పూర్తి చేశారని ఆరా తీశారు. ఇంకా బహువార్షిక పశుగ్రాసాల పెంపకాన్ని ఎంత విస్తీర్ణంలో సాగు చేయిస్తున్నారో వివరాలు తెలుపాలని కోరారు. వేసవిలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం అధికంగా ఉంటుందని పశుపోషకులకు వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించి పశు నష్టం సంభవించకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. పశు సంపద వృద్ధిలో అందరూ భాగస్వాములై డైరీ యూనిట్లను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పడమర ప్రాతకోటలో పూర్తి స్థాయి తనిఖీ చేపట్టి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యులు శ్రుతికీర్తి, సుమన్, రాగసంధ్య ఉన్నారు.

శివరాత్రి భక్తులకు అటవీశాఖ ఏర్పాట్లు


మాట్లాడుతున్న సబ్‌డీఎఫ్‌ఓ, రేంజర్

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అటవీశాఖ ఏర్పాట్లు చేస్తుందని సబ్-డీఎఫ్‌ఓ అబ్దుల్‌రవూఫ్, రేంజర్ సుభాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉన్నిపెంట అటవీశాఖ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 19 నుంచి మార్చి 1 వరకు 24 గంటలపాటు వాహనాల రాకపోకలకు అటవీశాఖ చెక్‌పోస్టులు తెరచి ఉంచుతామన్నారు. వెంటాపురం నుంచి కాలినడకన వచ్చే భక్తుల కోసం అక్కడక్కడా తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. పర్వదినం సందర్భంగా రెండు లీటర్ల ప్లాస్టిక్ బాటిళ్లను భక్తులు తమ వెంట తీసుకురావచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు భక్తులకు అందించే వైద్యసేవలు, భోజన సదుపాయం, తాగునీరు మజ్జిగ, ఇతర సదుపాయాలకు ఎటువంటి ఆంక్షలు ఉండవని అటవీశాఖ అధికారులు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు తొలగించుకోండి

పాములపాడు: మండల కేంద్రంలోని కేజీ రోడ్డు, మిట్టకందాల రహదారి వెంట దుకాణాల ముందు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు తొలగించుకోవాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు గురువారం దండోరా వేయించారు. ప్రధాన రహదారి వెంట దుకాణాల ముందు రేకుల షెడ్ల నిర్మాణాలు చేపట్టడంతో వాహన చోదకులు, బాటసారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ప్రజల నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో అధికారులు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. అందులోభాగంగా దుకాణ దారులు స్వతహాగా తొలగించుకోవాలని, లేకపోతే పంచాయతీ రాజ్ శాఖ సిబ్బందే తొలగిస్తారని దండోరా వేయించారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఫారెస్ట్ అధికారిణి నాగమల్లేశ్వరి

వెలుగోడు: వసతి గృహంలో ఉన్న విద్యార్థులు మంచిగా చదివి అత్యున్నత మార్కులు సాధించాలని నంద్యాల జిల్లా ఫారెస్ట్ అధికారిణి నాగ మహేశ్వరి తెలిపారు. మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఉన్నటువంటి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్‌కు కావాల్సిన ప్యాడ్, పెన్ను తదితర సామగ్రిని పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. హాస్టళ్లలో అన్ని వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి మధుసూదన్ రెడ్డి, సీనియర్ సహాయకులు నాగన్న, హాస్టల్ వార్డెన్ రాజు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర రెడ్డి, గ్రామ నాయకులు శంకర్ రెడ్డి, కాంతారెడ్డి పాల్గొన్నారు.

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి


ఎండుమిర్చి దిగుబడులను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

జూపాడుబంగ్లా: పండుమిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం వారు తూడిచెర్ల గ్రామంలో రైతులు పండించిన మిర్చిపంటను పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సరైన వర్షాల్లేకపోవటంతో మిర్చి పంటకు వైరస్‌తెగులు వ్యాపించి సాగు చేసిన పంటల దిగుబడి తగ్గిందన్నారు. ఎకరాకు రూ.1.20లక్షల పెట్టుబడి పెడ్తే కేవలం 4 నుంచి 5క్వింటాళ్లు మాత్రమే రైతులకు దిగుబడివచ్చినట్లు తెలిపారు. రైతులు సాగుచేసిన పంట చేతికందే వరకు క్వింటాలు రూ.25వేలు ఉన్న ఎండుమిర్చి ధర వ్యాపారులు కుమ్మక్కై క్వింటాలు రూ.11వేలకు తగ్గించటం దారుణమన్నారు. పొలంకౌలు, పంట సాగుకు తెచ్చిన అప్పులు, వడ్డీ పోను రైతుకు నష్టమే మిగులుతుందన్నారు. రైతులు వాణిజ్య, ఉద్యానవన పంటలు సాగుచేసుకోవాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొంటున్నా ఉద్యానవన, వాణిజ్య పంటలు సాగుచేసిన రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వారిని ఆదుకోవటంలో విఫలం అయ్యారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఖరీఫ్, రబీ సీజన్‌ల ప్రారంభానికి ముందే రైతులకు రూ.20వేల పెట్టుబడి సహాయం అందజేస్తామని పేర్కొని ఇప్పటిదాకా పైసా సహాయం చేయకపోవటం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆత్మకూరు, నందికొట్కూరు మార్కెట్ యార్డులలో మిర్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాలుకు రూ.25 వేల చొప్పున మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. లేని ఎడల మిర్చి రైతులను పోగుచేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యమిస్తాం

- మూడో రోజూ కొనసాగిన మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్ష


రిలే దీక్షల్లో కార్మికులు

ఆత్మకూరు: ఆప్కాస్ రద్దు చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు, ప్రసాద్, గొడుగు రాజు, సువర్ణమ్మ హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, కమిషనర్ రమేష్‌బాబులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు, గౌడ్ సెంటర్, అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అప్కాసులో లక్షలాది మంది కార్మికులు ఉన్నారని, రద్దు చేస్తే వారు జీవనాధారం కోల్పోతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిమ్మయ్య, దానం, జయన్న, సురేష్, రాజేంద్ర, నాగన్న, మరియమ్మ, మేరమ్మ, కుమారి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల విడుదల


వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల వాల్ పోస్టర్లను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లోని బంజారాలు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, కలెక్టర్‌లు, ఉన్నతాధికారులు, ప్రముఖ బంజారా నాయకులు హాజరవుతారన్నారు. వివిధ జిల్లాల నుంచి బంజారాలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ నాగజ్యోతి, డీఎంసీ రమేష్‌నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామ్ బాలాజీనాయక్, రమేష్‌నాయక్, సలహాదారుడు కె.బాలనాయక్, ఆర్.శివశంకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, కిషోర్‌నాయక్, మత్రునాయక్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

ఆత్మకూరు: మండలంలోని కొట్టాల చెరువు గ్రామంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, బాలికల వసతి గృహాన్ని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా డిస్ట్రిక్ మెంబర్ జి.రమేష్‌నాయక్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన అన్నం, గుడ్డు కూర, రసం, మజ్జిగను పరిశీలించారు. స్నానపు గదుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, దోమలు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందేలా చేయాలి


ఐటీడీఏ అదనపు ప్రాజెక్టు అధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

జూపాడుబంగ్లా: చెంచు, గిరిజనులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు కోరారు. గురువారం ఆయన సున్నిపెంటలోని ఐటీడీఏ కార్యాలయంలో అడిషనల్ ప్రాజెక్టు అధికారి సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కొత్త సిద్దేశ్వరం, 80 బన్నూరు గ్రామాల్లోని చెంచులు, గిరిజనులకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాల్లేకపోవటంతో వారు నేటికీ పూరిగుడిసెల్లోనే నివాసం ఉంటున్నారన్నారు. నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల పరిధిలో అధికంగా చెంచులు, గిరిజనులు నేటికీ పూరిగుడిసెల్లోనే కాలం వెల్లదీస్తున్నారన్నారు. వారికి ఇప్పటిదాకా పక్కాగృహాలు, ఇళ్లస్థలాలు మంజూరు చేసిన దాఖలాల్లేవన్నారు. కొత్తసిద్దేశ్వరం గ్రామంలోని గిరిజనులకు ఇప్పటిదాకా ఒక్కసంక్షేమ పథకం వర్తింపజేయలేదంటే వారు ఇంతకు ఐటీడీఏ పరిధిలో ఉన్నారా లేదా అనేది సందిగ్ధంగా ఉందన్నారు. 80బన్నూరు, కొత్తసిద్దేశ్వరం వాసులకు జూపాడుబంగ్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయించాలని కోరారు. అనంతరం ఆయన పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

బాల్య దశలోనే ఆరోగ్య లోపాలు గుర్తించాలి


విభిన్న ప్రతిభావంతుల ఇంటి వద్ద అవగాహన కల్పిస్తున్న న్యాయవాది బతుకులయ్య

పాములపాడు: బాలలు, విభిన్న సామర్థ్యం ఉన్న పిల్లల సంరక్షణార్థం బాల్య దశలోనే ఆరోగ్య లోపాలను గుర్తించాలని ఆత్మకూరు ప్యానల్ న్యాయవాది బతుకులయ్య, సర్పంచు వరప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో బాల్య స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది విభిన్న సామర్థ్యం ఉన్న పిల్లల శాతాన్ని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలు, బాల్యవివాహాలు జరగడం వల్ల సంభవించే దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు ప్రోత్సహించే వారికి చట్టప్రకారం తీసుకునే చర్యలను వివరించారు. దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్ పొందడం, ప్రభుత్వం తరఫున సంరక్షణ కాలలైన ఆర్‌బీఎస్‌కె, ఆర్కెస్కే, డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లకు పేర్లను నమోదు చేయడం తదితర విషయాల గురించి వివరించారు.

మండల మీట్‌ను బహిష్కరించిన ఎంపీటీసీలు

- కోరం లేక వాయిదా పడిన మండల సమావేశం

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ను ఎంపీటీసీలు గురువారం బహిష్కరించారు. కొన్ని నెలలుగా తమ గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఎంపీటీసీలు సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. సమావేశం మళ్లీ 20 తేదీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు హాజరవుతారనే ఉద్దేశంతో సమావేశాన్ని ప్రారంభించి, కాసేపటికి ఎంపీటీసీలు రారని నిర్ధారించుకుని వాయిదా వేశామన్నారు. సమావేశంలో ఎంపీపీ లాలం రమేష్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దామోదర సంజీవయ్య జీవితం భావితరాలకు ఆదర్శం


పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

నందికొట్కూరు: దివంగత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జీవితం భావితరాలకు ఆదర్శమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల జేసీ నాయకులు జయరాముడు, డాక్టర్ రాజు, తమ్మడపల్లి ఏసేపు అన్నారు. గురువారం పట్టణంలోని స్కూళ్లలో దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన జీవితంపై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల జేసీ నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన దామోదర సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. దామోదర సంజీవయ్య జీవితం విద్యార్థులకు తెలియజేసేందుకే పోటీ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కాలర్ స్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్, జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, తమ్ముడపల్లి ఏసేపు, రాజు, ఉపాధ్యాయులు సాయిలక్ష్మి, కోటేశ్వరరెడ్డి, నూర్‌పాషా పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి


రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్నఏఓ

వెలుగోడు: ఫార్మర్‌కు సంక్షేమ పథకాలు వర్తించాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అన్నారు. గురువారం వేల్పనూరు రైతు సేవ కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములు కలిగిన ప్రతి రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వ్యవసాయ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు మాత్రమే అర్హులన్నారు. ప్రతీ రైతుకు జారీ చేసే యూనిట్ ఐడీకి ఆయా రైతులు సీజన్లో పొందే సబ్సిడీలు, రుణాలు, పంటల బీమా వంటి పథకాలను అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీని యూనిఫైడ్ ల్యాండ్ ఏపీఐ, ఆధార్ బేస్డ్ అథంటికేషన్, పీఎం కిసాన్ వంటి డిజిటల్ అగ్రికల్చర్ ప్లాట్‌ఫామ్‌కు సైతం అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి


వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఆత్మకూరు: అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సూపర్‌వైజర్‌లకు వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రియాంక, రమాదేవి, భారతి, రవణమ్మ, విజయలక్ష్మి, లక్ష్మికుమారి, పద్మావతి, స్వప్న, రాణి, శాంతి, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


అనీమియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర తిరుపతి

మిడుతూరు: స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, చిన్నపిల్లల వైద్యులు తిరుపతి తెలిపారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తరచూ తలనొప్పి, కళ్లు తిరగడం, నిద్ర పట్టకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, అలసట తదితర రక్తహీనత లక్షణాలుంటే డాక్టర్లను సంప్రదించాలన్నారు. హిమోగ్లోబిన్ శాతం పెరగాలంటే పాలకూర, గోంగూర, బచ్చలి కూర, విటమిన్ ఎ, సి, మెగ్నీషియం, ఐరన్ వంటి పోషకాలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న పిల్లలకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ విజయలక్ష్మి, హాస్పిటల్ సిబ్బంది ముర్తుజావలి, రజిత, చంద్రకళ, మీన పాల్గొన్నారు.